మొదలైన వారందరికీ నన్ను మెచ్చుకుంటూ పరిచయం చేశారు. అందుకు రాశాను, ఆనాటి ఆ కథలు. నేను రాసిన కథలు నా అధ్యాపకుల్ని మెప్పించ గలుగుతున్నాయని ఆత్మ విశ్వాసంతో రాశాను. భారతిలో పడిన కథకి డబ్బు పంపేరు. ఆ మనియార్డర్ చూసి మా నాన్నగారు "ఓరి! వోరి! నేను నెల రోజులు ఉద్యోగం చేస్తే వచ్చే డబ్బు నువ్వొక్క కథ రాసి సంపాదించేసేవురా!" అని బాధగా ఆనందించేరు. అదుగో, అందుకు రాశాను, ఆ కథలు. అంటే, కథలు రాస్తే డబ్బు వస్తుందని కూడా రాశాను. రచయితలకి డబ్బులివ్వకుండా ఎగేసే పత్రికలు ఇప్పటి కన్నా అప్పుడు ఎక్కువగా ఉండేవి. రచన ప్రచురించగానే "మరి డబ్బు పంపండి సార్!" అని ఎడిటర్ గారి పేరిట ఉత్తరం రాసి ఆ కథకి డబ్బు అందుకున్నప్పటికీ ఆ తరువాత ఆ పత్రిక ఆదరణ [అంటే నా కథ ఆ పత్రికలో ప్రచురించే యోగ్యత] పోగొట్టుకోడం అనుభవం లో కొచ్చినా రచన చేస్తే డబ్బు వస్తుందనే సామాజిక స్పృహ కలగడం నా రచనా వ్యాసంగ చరిత్రలో ఒక కిలోమీటర్ రాయిగా పేర్కొనవచ్చు. [నాకు కలిగిన మొట్టమొదటి, మరియు చిట్ట చివరి సామాజిక స్పృహ అదేనని నాకు చాలా అనుమానం] అందులోనూ; తివిరి ఇసుమున తైలంబు తీసినట్టు, ఆనందవాణి పత్రిక నుంచి మనియార్డర్ అందుకున్న పారితోషిక వీరుడిగా నాకు చాలా ఖ్యాతి వచ్చింది 1951 నాటికే.

1953 ప్రాంతంలో ఆ కారణంగా ఆగిపోయిన నా కథన కుతూహలం [కొద్దిపాటి మినహాయింపులు, తీసేస్తే] బాపు, ముళ్ళపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు, రావికొండలరావు, వి.ఏ.కె. రంగారావు, వి.వి. రాఘవయ్య సంపాదక మండలిగా 1963లో వెలువరించిన జ్యోతి[మాసపత్రిక]తో మళ్ళీ చెలరేగింది. ఈ మాటు, నా కిష్టమైన వ్యక్తులు కొందరు నా కథలని చదివి, బొమ్మలు వేసి, ప్రచురించి ఇష్టపడుతున్నారనే భావం నా కిచ్చిన ప్రోత్సాహం వల్ల కథలు రాయడం సాగించేను. బాపు అంతటి ఆర్టిస్టు, నేను సరదాగా రాసిన కథలకి నాలుగేసీ ఆరేసీ బొమ్మలు వేసెయ్యడమే కాక ఎప్పుడు నేను కనిపించినా ఆత్మీయంగా ప్రశంసా పూర్వకంగా మాట్లాడే వారంటేనూ; ముళ్ళపూడి వెంకటరమణ ఇవాళ కూడా నేను 1960లో రాసిన ఒక కథ గురించి లోతుగా మాట్లాడకుండా నన్ను సాగనంపరంటేనూ; నండూరి రామమోహనరావు నా పుస్తకాలకి ప్రీ ఫేసులు రాస్తూ ఎవరికోగాని ఇయ్యని కితాబులు ఇచ్చారంటేనూ; రాస్తానా, రాసి చూపిస్తానా!

వాళ్ళే కాదు. కథా సాహిత్యం గురించి అంతో ఇంతో తెలిసిన వాళ్ళు, కల్పనా సాహిత్యపు లోతుపాతులను చవి చూసినవాళ్ళు అయిన సంపాదకులు విమర్శకులు పాఠకులు; వ్యక్తిగతంగాను, ఉత్తరాల్లోను మీరీ మధ్య ఏమీ రాయడం లేదని ప్రశ్నలు వేయడం రాయండి అని ప్రోత్సహించడం కూడా విరివిగా తరచుగా సంభవించడం వల్ల కూడా నేను రాయకుండా ఉండలేకపోతున్నాను.

సమాజంలోని క్రౌర్యాలు, నైచ్యాలు, దౌష్ట్యాలు అట్టడుగు చీకటి కోణాలు నా కథల్లో ప్రసక్తికి రావని; సాంఘిక దురాచారాల్ని చీల్చి చెండాడడం సంఘ సమస్యల్ని ఎడా పెడా పరిష్కరించి పారెయ్యడం నా [కథల] కార్య రంగం కాదని, మధ్య తరగతి సంసారాల్లో తటస్థపడే స్వల్ప ప్రాముఖ్యం కల సంఘర్షణలను వస్తువులుగా తీసుకుని మనసును ఆహ్లాద పరిచే విధంగా నేను కథలు రాస్తానని, నా మొదటి కథా సంకలనం [1966] వెనకాలి అట్ట మీద ప్రచురణకర్తలు [జ్యోతి బుక్స్, విజయవాడ] వివరించేరు. ఇంచుమించు ఇవే మాటల్ని నా రెండో కథా సంకలనం [1977] ప్రీ-ఫేస్‌లో నండూరి రామమోహనరావు చెప్పేరు. నా కథల స్వభావాన్ని గురించిన ఈ "విశ్లేషణ"లో ప్రశంసా, అభిశంసా కలిసే ఉన్నాయనీ, నా చుట్టూ ఉన్న సమాజం గురించి కథలు రాస్తూ దానికి ఫలితంగా ప్రతిష్ఠా పారితోషికం పొందుతున్నందుకు ఆ సమాజంలోని వ్యక్తుల సెంటిమెంట్లను మాత్రమే వస్తువులుగా తీసుకుని క్లిష్టమూ, ముఖ్యమూ అయిన సంఘర్షణల వల్ల శ్రద్ధ చూపించడం లేదంటే-నాకు రచయితగా సమాజం వల్ల ఉన్న బాధ్యతను నేను సక్రమంగా నిర్వర్తించడం లేదని చెప్పడమే ఈ వాక్యాల అంతరార్థం కావచ్చుననీ నాకు చాలా లేటుగా తెలిసింది. పాఠకులకి వినోదం [పోనీ ఆహ్లాదం], రచయితలకి ధన ప్రతిష్ఠలు మాత్రమే సాధించే రచనా వ్యాసంగం యావత్తూ ప్రయోజన విహీనం అని కొట్టి పారెయ్య గలిగే ప్రమాణాలు అమల్లో కొస్తే నాతో బాటుగా చాలా మంది రచయితలూ ఒకరో ఇద్దరో తప్ప రచయిత్రులందరూనూ బఫూన్‌లయిపోతారు. కాని, రచన అనేది ఒక వ్యసనమనీ, స్వ స్వరూప పరిజ్ఞానం ఏర్పడ్డాక కూడా ఇంకా ముదిరే వ్యసనాలన్నిట్లోనూ ఉత్తమ వ్యసనమనీ ఘోటక సంస్కర్తలూ, వీర విప్లవ వాదులూ కూడా అంగీకరించక తప్పదు కదా అని ఒక ధీమా. వ్యాపారంలో లాభాలు చేసుకునే వాళ్ళూ రచనా వ్యాపారంలో లబ్ధి పొందేవాళ్ళూ ఒకటి కాదన్నది నిజం, నిజం!

ఆమధ్య ఒక జోక్ చదివాను. ఒక ప్రఖ్యాత రచయిత తన ఆంతరంగిక మిత్రుడొకడి దగ్గర "నేను అంత గొప్పగా రాస్తున్నట్టు లేదు కదూ?" అని వాపోయాట్ట. దానికి ఆ మిత్రుడు "పోనీ ఆపెయ్యకూడదా?" అన్నాడట. "ఎలా? ఇంత ప్రఖ్యాతి వచ్చేశాక. ఆపెయ్యాలంటే అది నా చేతిలో పని కాదే!-"అని ఆ రచయిత జవాబు. ఇది నాకు కూడా వర్తిస్తుందేమో. ఎందుకంటే నాణ్యత తగ్గిపోతున్నా ఉత్పత్తి ఆగిపోని అనేక వ్యావృత్తుల్లో రచనా వ్యాసంగం కూడా ఉంది కదా.

"ఎందుకు రాయడం లేదు?" అని అడిగినట్టే "ఎందుకు రాస్తున్నావు?"అని కూడా ఎవరో అడుగుతూనే ఉంటారు నన్ను. సరికొత్త ట్రెండ్స్ సెట్ చేసి, తెలుగు కల్పనా సాహిత్యపు పరిధినీ,పరిమాణాన్నీ అనూహ్యంగా మార్చేసిన ఈ కొత్త యుగపు రచయితల కాలంలో "ఎందుకు రాస్తున్నాను"అని నాకూ అనిపిస్తూనే ఉంటుంది! ●


మినీకథ:

## తల్లి గోదారి

పి. స్వరాజ్యలక్ష్మి

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి రైలు పెట్టె అంతా కలియతిరుగుతున్న ఆ ముష్టివాళ్ళనే చూస్తూ కూర్చున్నాను. గుడ్డివాడొకడు ముందున్న కుంటివాడి భుజం పట్టుకొని అరుస్తున్నాడు-"అమ్మా ధర్మం..." అంటూ.

"ఛీ...దూరంగా ఉండు" అంటూ కసురుకొంది పట్టుచీర కట్టుకున్నావిడ.




తింటున్న టిఫిన్ డబ్బా మూత మూసేసి ఈసడింపుగా చూశాడో నడివయసు పెద్దమనిషి.

నేను చూస్తుండగా ఆ ముష్టివాళ్ళకు ఓ పైసా దానం చేసిన వాళ్ళెవరూ కనిపించలేదు.

హేండ్‌బేగ్ తెరిచి ఓ పావలా కాను తీసి చేతిలో పెట్టుకొన్నాను, వాళ్ళు నా దగ్గరకు వస్తే వేద్దామని.

అంతలో రైలు గోదావరి బ్రిడ్జి మీదకు ప్రవేశించింది. రైలు మోతలో ముష్టివాళ్ళ కేకలు వినపడటం లేదు.

అంతలో ... ఠంగ్..ఠంగ్‌మంటూ శబ్దాలు మొదలయ్యాయి. రైల్లో జనం చాలామంది చిల్లర డబ్బులు తీసి గోదారమ్మ తల్లికి దానం చేస్తున్నారు! ఎవరికి తోచింది వాళ్ళు డబ్బులు గోదావరిలోనికి విసిరేస్తున్నారు. వాళ్ళు విసురుతున్న నాణేలు కిటికీలకు తగిలి శబ్దాలు వస్తున్నాయి.

కుంటివాడు నదిలో పడుతున్న ఆ నాణేల వైపు నోరావలించి చూస్తున్నాడు. గుడ్డివాడు తన ముందు చిల్లర నాణేలు ఏవో పడ్డాయనుకొని ఆత్రంగా కింద తడుముకొంటున్నాడు! రైలు పోతూనే ఉంది. నాణేలు పడుతూనే ఉన్నాయి. గోదావరి ప్రవహిస్తూనే ఉంది. ✱